

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

నంద్యాల జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు.



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 245 | పేజీలు - 08 | వెల - 05/- | సోమవారం 31-08-2026


# వెలిగొండలో జలవిజయం.

## వెలిగొండతో కరవుకు శాశ్వత పరిష్కారం

రన్ విజయవంతం



- సంతృప్తికరంగా ముగిసిన వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్
- కొల్లం వాగు వద్ద గేట్లు ఎత్తి సొరంగంలోకి కృష్ణా జలాల విడుదల
- నేడు ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సీఎం చంద్రబాబు
- ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల కరవు ప్రాంతాలకు తీరనున్న నీటి కష్టాలు



ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు, సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' అవార్డును ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్

# మోదీకి 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' అవార్డు

● 30కి పైగా అంతర్జాతీయ అవార్డులు అందుకున్న భారత నేతగా మోదీ రికార్డు ● తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు ● ఉజ్బెకిస్థాన్‌లో ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించిన ప్రధాని



2

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..

● కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్ ● రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి ● సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా ● అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత



2

## నేపాల్‌లో మరో జల ప్రళయం.. మరో హై అలర్ట్ జారీ

● నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ ● నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు ● రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన ● సహాయక చర్యల్లోని సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి



2

ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి

# ఏఐ టెక్నాలజీతో జెండావందనం.. కరీంనగర్ బాల మేధావికి ఈటల అభినందనలు

కరీంనగర్ జిల్లా బాలుడి అద్భుత ఆవిష్కరణ

- ● ఏఐ, మొబైల్ ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ సిస్టమ్ రూపకల్పన
- ● 13 ఏళ్ల శ్రీ సృష్టి సాయిని ప్రశంసించిన ఎంపీ ఈటల రాజేందర్
- ● ప్రధాని మోదీ వల్లే దేశంలో డిజిటల్ విప్లవం సాధ్యమైందన్న ఈటల
- ● విద్యార్థులు ఏఐ, కోడింగ్ నైపుణ్యాలు నేర్చుకోవాలని పిలుపు



కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన 13 ఏళ్ల బాల మేధావి శ్రీ సృష్టి సాయి సాంకేతిక ప్రతిభపై మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో మొబైల్ ద్వారా నియంత్రించే వైఫై ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ (జెండా వందనం)

మిగతాది 2లో

## విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స

● వైసీపీలో సజ్జల నెంబర్ 1, జగన్ నెంబర్ 2 అంటూ విజయసాయి వ్యాఖ్యలు● ఈ కామెంట్లపై తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ● విజయసాయి రెడ్డిని కేఏ పాల్‌తో పోల్చుతూ ఘాటు విమర్శ



2

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకత్వాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. వైసీపీలో సజ్జల

# విశాఖకు ప్రపంచస్థాయి వైద్యం.

సోమవారం శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్

- విశాఖలో కొలువుదీరనున్న ఏఐజీ ఆసుపత్రి
- రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 9,000 మందికి ఉపాధి
- వెయ్యి పడకలతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు



ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగం మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రి ఇప్పుడు విశాఖపట్నంలో తన శాఖను ఏర్పాటు చేయనుంది. ప్రజాప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో, ఈ ప్రపంచ స్థాయి వైద్య సంస్థ రాక ఆరోగ్య రంగానికి మరింత బలాన్ని చేకూర్చనుంది. నగరంలోని ఎండాడ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, రాష్ట్ర ప్రజలు ఇకపై అత్యున్నత వైద్యం కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుంది.

మిగతాది 2లో

# 30 ఏళ్ల కల సాకారం

- నేడు వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును పూర్తి చేయడంపై సర్వత్రా హర్షం
- తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు
- కరువు పీడిత ప్రాంతాల అభివృద్ధికి రెక్కలు వస్తాయని ఆశాభావం
- 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో ఘనంగా వేడుకలు



2

ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడనుంది. కరవు నేలకు కృష్ణమ్మ జలాలు పరుగులెత్తనున్నాయి. మార్కాపురం జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు పీడిత ప్రాంతాల తలరాతను మార్చగల వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మార్కాపురం జిల్లాలో పర్యటించి, ప్రాజెక్టు తొలి దశను (ఫేజ్-1) లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం, 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, ఇప్పుడు తన చేతుల మీదుగానే తొలి దశను ప్రారంభించనుండటం ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది.

## వైసీపీ మాజీ మంత్రిపై కేసు నమోదు

● వైసీపీ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై కేసు ● బలవంతంగా గృహ ప్రవేశాలు చేయించారని ఆరోపణ ● ధర్మానతో పాటు మరో ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు ● గృహనిర్మాణ శాఖ డీఈఈ ఫిర్యాదుతో పోలీసుల చర్యలు ● హుద్‌హుద్ బాధితుల ఇళ్ల పంపిణీలో వివాదం



2

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా

# 30 ఏళ్ల కల సాకారం

లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం, 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, ఇప్పుడు తన చేతుల మీదుగానే తొలి దశను ప్రారంభించనుండటం ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది. 'వెలిగొండ జలసిరులు–అభివృద్ధికి రెక్కలు' పేరుతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది.

**జీవనాధార ప్రాజెక్టుతో కొత్త అధ్యాయం**

తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ భూతంతో దశాబ్దాలుగా అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు, అదొక జీవనాధారం. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించి, అక్కడి నుంచి కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీర్చడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. తొలి దశ ప్రారంభంతో 10.70 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయనున్నారు. దీని ద్వారా తక్షణమే 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మంది ప్రజలకు సురక్షిత తాగునీరు అందనుంది.

ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మొత్తం 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 మండలాల్లోని సుమారు 23 లక్షల మందికి తాగునీటి భద్రత లభిస్తుంది. ఈ జలాలు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ రంగంలో అనిశ్చితి తొలగిపోయి, వివిధ రకాల పంటలు పండించేందుకు మార్గం సుగమమవుతుంది. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గి, ఉద్యానవనం, ఆగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాల అభివృద్ధికి ఊతమిస్తుంది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, వలసలకు శాశ్వతంగా అడ్డుకట్ట పడనుంది.

సంకల్పం నుంచి సాకారం వరకు... 30 ఏళ్ల ప్రయాణం

1996లో చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు ప్రయాణం అంత సులభంగా సాగలేదు. సొరంగాల నిర్మాణం, భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం వంటి క్లిష్టమైన సాంకేతిక, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పనులు కొనసాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే, వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా గుర్తించి పనులను పరుగులు పెట్టించింది. ముఖ్యంగా, ప్రాజెక్టు పురోగతికి అడ్డంకిగా మారిన నిర్వాసితుల పరిహారంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారాన్ని చెల్లించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది.

అంతేకాకుండా, గెజిట్, జాబితాలలో పేర్లు లేని వారికి రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు రూ.2 లక్షల చొప్పున అదనపు పరిహారం ప్రకటించి వారిలో భరోసా నింపింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబే, ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అనే అరుదైన ఘట్టానికి ఆగస్టు 31వ తేదీ వేదిక కానుండటంతో స్థానిక ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం జిల్లాలో ఈ క్రింది షెడ్యూల్ ప్రకారం పర్యటించనున్నారు:

ఉదయం 9:30: ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.

ఉదయం 10:15: మార్కాపురం జిల్లా, దోర్నాల మండలం, గంటవానిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

ఉదయం 10:25: రోడ్డు మార్గంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదిక వద్దకు చేరుకుంటారు.

ఉదయం 10:35 – 11:20: ప్రత్యేక పూజలు నిర్వహించి, పైలాన్‌ను ఆవిష్కరించి, గేట్లను ప్రారంభించి కృష్ణా జలాలను విడుదల చేస్తారు.

ఉదయం 11:30: గంటవానిపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

మధ్యాహ్నం 1:30: సభ అనంతరం తిరుగు ప్రయాణమవుతారు.

మధ్యాహ్నం 2:15: ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు. ఈ చారిత్రక ఘట్టంతో మార్కాపురం సహా రాయలసీమ కరవు పీడిత ప్రాంతాల అభివృద్ధికి కొత్త అధ్యాయం మొదలవుతుందని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు.

# విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి నెంబర్ 1 అని, జగన్ నెంబర్ 2 అని ఆయన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. విజయసాయి రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "విజయసాయి రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆయన మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పని లేదు. రాజకీయాల్లో ఇలాంటి వాళ్లు వస్తూ పోతూ ఉంటారు. ఇంతకుముందు మనకు కేఏ పాల్ ఒకరు ఉండేవారు, ఆయన ఏదేదో మాట్లాడుతుండేవారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి రెండో వ్యక్తిగా తయారయ్యారు. ఆయన మాటలకు విలువ ఇచ్చి స్పందించడం అంటే మన సమయాన్ని మనం వృథా చేసుకోవడమే. చూడండి, శుభ్రంగా సాయంత్రం వేళ ప్రశాంతంగా కూర్చున్నాం. ఇలాంటి సమయంలో ఆ పనికిమాలిన మాటల గురించి ఎందుకు మాట్లాడాలి? దానివల్ల నా సమయం వృథా అవ్వడమే కాకుండా, అసలు విషయాలైన ప్రజా సమస్యల నుంచి మన దృష్టి మళ్లుతుంది. ప్రజల సమస్యలు ఎన్నో ఉన్నాయి, వాటిపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఇలాంటి వాటి కోసం కాదు. ఆయనకేదో అది పెద్ద విషయంలా అనిపిస్తే, దానికోసం ఒక ప్రెస్ మీట్ పెట్టుకోమనండి. బహిరంగంగా చెప్పుకోమనండి. అంతేగానీ, దానికోసం మేం సమయం కేటాయించం. అనవసరంగా ఇలాంటి విషయాల గురించి చర్చించి మన విలువైన సమయాన్ని పాడుచేసుకోవడం ఎందుకు? కాబట్టి, ఆ విషయం గురించి మళ్లీ మళ్లీ అడిగి మీ సమయం, నా సమయం వృథా చేయొద్దని కోరుతున్నాను" అని బొత్స పేర్కొన్నారు.

# వైసీపీ మాజీ మంత్రిపై కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా గృహ ప్రవేశాలు చేయించారన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం ఆయనతో పాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గృహనిర్మాణ శాఖ శ్రీకాకుళం డీఈఈ వి.వి. సత్యాజీ అందజేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరణం సురేశ్ వెల్లడించారు. గతంలో హుద్‌హుద్ తుపాను బాధితులైన మత్స్యకార కుటుంబాల కోసం ప్రభుత్వం గృహాలను నిర్మించింది. పంపిణీ సమయంలో కొంతమంది లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో ఆయా ఇళ్లను ఖాళీగా ఉంచారు. ఈ నేపథ్యంలో తమకు ఆ ఇళ్లను కేటాయించాలని కోరుతూ వైసీపీకి చెందిన కొందరు మత్స్యకారులు గతంలో కలెక్టరుకు విన్నవించుకున్నారు. అయితే, గత మే 14వ తేదీన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్యతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఇళ్లలోకి బలవంతంగా ప్రవేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. డీఈఈ ఫిర్యాదు మేరకు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సురేశ్ వివరించారు. ఈ పరిణామం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది

# వెలిగొండలో జలవిజయం

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

## నేపాల్‌లో మరో జల ప్రళయం..

# మరో హై అలర్ట్ జారీ

ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది. "భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్టు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది. కొద్దిసేపటికే ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

# విశాఖకు ప్రపంచస్థాయి వైద్యం

భారీ పెట్టుబడి, ఉపాధి అవకాశాలు

విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుకుంటుంది. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ద్వారా రోజుకు 5,000 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన తర్వాత సుమారు 1000 మంది డాక్టర్లు ఇక్కడ సేవలు అందించనున్నారు.

**ప్రాజెక్టు స్వరూపం, నిర్మాణ ప్రణాళిక**

విశాఖలోని ఎండాడలో మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి క్యాంపస్‌ను, మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనలతో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఒకేచోట ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మొదటి దశలో టవర్–ఏ, టవర్–బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో చేపట్టి, 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో టవర్–సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లోని ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మాతా శిశు విభాగం కూడా ఉంటుంది.

**పరిశోధన, శిక్షణకు పెద్దపీట**

వైద్య సేవలతో పాటు విద్య, పరిశోధనలకు ఏఐజీ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నర్సింగ్ కళాశాల, సిబ్బందికి హాస్టల్, పారామెడిక్ సిబ్బందికి శిక్షణా కేంద్రం, 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం. విజిటింగ్ ఫ్యాకల్టీ, వైద్యుల కోసం వసతితో పాటు రోగుల సహాయకుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారు. వైద్య రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఏఐజీ, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ఎండోస్కోపీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి రాకతో విశాఖ హెల్త్‌కేర్ హబ్‌గా మారడమే కాకుండా, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## ఏఐ టెక్నాలజీతో జెండావందనం..

# కరీంనగర్ బాల మేధావికి ఈటల అభినందనలు

కురిపించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో మొబైల్ ద్వారా నియంత్రించే వైఫై ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ (జెండా వందనం) సిస్టమ్‌ను రూపొందించిన సృష్టి సాయిని ఆయన అభినందించారు. చిన్న వయసులోనే సాంకేతికతపై పట్టు సాధించి అద్భుత ఆవిష్కరణ చేసిన ఆ బాలుడు ఎందరికో ఆదర్శమని కొనియాడారు. ఈ విషయంపై ఈటల రాజేందర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "శ్రీ సృష్టి సాయి ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభ అభినందనీయం. ఈ పిన్న వయసులోనే అతని ఆవిష్కరణ గర్వకారణం" అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'డిజిటల్ ఇండియా' దార్శనికతతో దేశం ముందుకు దూసుకెళ్తోందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి రంగాలకు అత్యంత

ప్రాధాన్యత ఇవ్వడం వల్లే సృష్టి సాయి వంటి యువ ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారని అభిప్రాయపడ్డారు. మోదీ ప్రోత్సాహంతో భారత్ నేడు కేవలం టెక్నాలజీని వినియోగించే దేశంగా కాకుండా, కొత్త టెక్నాలజీలను సృష్టించే గ్లోబల్ హబ్‌గా మారుతోందని ఈటల అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి విద్యార్థులు సంప్రదాయ చదువులతో పాటు ఏఐ, కోడింగ్ వంటి ఆధునిక నైపుణ్యాలను అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీ సృష్టి సాయి భవిష్యత్తులో మరిన్ని గొప్ప ఆవిష్కరణలు చేయాలని మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తన పోస్టులో ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.



# మోదీకి 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' అవార్డు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు.



మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది.

ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన 30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే.

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

# రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్





ఆదేశాలమేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు ,నేరచరిత్ర గలవారికి ,చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు.అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

# బుగ్గరాముడు సేవా కార్యక్రమం

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల జిల్లా నంద్యాల నియోజవర్గం స్థానిక 38వ వార్డు నందమూరి నగర్ నందు నివాసం ఉంటున్న షేక్ మహబూబ్ బాషా (బాజి) కుమార్తె



వివాహానికి 5,000/- రూపాయలు 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా బుగ్గరాముడు మాట్లాడుతూ 38వార్డు నందు వై.యస్.ఆర్ నగర్, నందమూరి నగర్ నందు ఎవరి పెళ్లి జరిగిన తన వంతుగా ఆర్థిక సహాయం అందజేయడం,వార్డు నందు ఎవరు చనిపోయిన వారికి ఆర్థిక సహాయం చేయడం తన వంతుగా భావించాడు.ఈ కార్యక్రమం స్థానిక మంత్రి ఎన్ఎండి ఫరూక్, వారి కుమారులు ఎన్ ఎండి.ఫిరోజ్, ఎన్ ఎం డి ఫయాజ్ పర్యవేక్షణలో చేపట్టడం జరిగింది అని ఆయన అన్నారు. ఇప్పటికి దాదాపుగా 37 పెళ్ళిలకు ఆర్థిక సహాయం చేయడం జరిగిందని , ఇది 38వ పెళ్లి అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పెళ్లి కుమార్తె కుటుంబ సభ్యులు మరియు స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘట్కేసర్ సర్కిల్‌లో దూకుడు పెంచిన కౌకుట్ల జీవన్ రెడ్డి!

**యువ నాయకుడి దూకుడుపై రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్.. ప్రజల్లో ఆదరణపై జోరుగా చర్చ**

ఘట్కేసర్, మేడ్చల్ జిల్లా: ఘట్కేసర్ సర్కిల్ రాజకీయాల్లో యువ నాయకత్వం ఇప్పుడు హాట్



టాపిక్‌గా మారుతోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన యువ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి తనదైన శైలిలో ప్రజల్లోకి వెళ్తూ రాజకీయంగా దూకుడు పెంచుతున్నారనే చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. ప్రజా సమస్యలపై స్పందించడం.. స్థానిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. యువతతో మమేకం కావడం.. పార్టీ కార్యక్రమాలను ముందుండి నిర్వహించడం వంటి అంశాలతో జీవన్ రెడ్డి పేరు ఘట్కేసర్ సర్కిల్‌లో వినిపిస్తోందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. చిన్న కార్యక్రమం అయినా.. పెద్ద ఉత్సవం అయినా.. కార్యకర్తలు, యువతను కలుపుకుని ముందుకు వెళ్లే నాయకత్వం అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. "ప్రజల్లో ఉండే నాయకుడే మాకు కావాలి.. సమస్య వచ్చినప్పుడు ముందుండి మాట్లాడే నాయకత్వం కావాలి" అంటూ కొందరు యువత, స్థానికులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఘట్కేసర్ సర్కిల్‌లో పలు రాజకీయ సమీకరణాలు మారుతున్న వేళ.. జీవన్ రెడ్డి దూకుడు భవిష్యత్‌లో ఎలాంటి రాజకీయ ప్రభావం చూపనుందన్నది ఆసక్తికరంగా మారింది. యువ నాయకుడి దూకుడు.. ప్రజల్లో ఆదరణ.. కాంగ్రెస్‌లో కొత్త జోష్? ఘట్కేసర్ సర్కిల్‌లో కౌకుట్ల జీవన్ రెడ్డి పేరు చుట్టూ జరుగుతున్న ఈ చర్చ రానున్న రోజుల్లో మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

# మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ.

**దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున పుల్లయ్యను ఘనంగా సత్కరించిన డాక్టర్ రవి కృష్ణ ,ఎం.పీ.వి. రమణయ్య.**





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఆదివారం నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో, సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య అధ్యక్షతన జరిగిన సేవా కార్యక్రమంలో, సంఘం గౌరవ అధ్యక్షులు, అంతర్జాతీయ లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న పుల్లయ్య సౌజన్యంతో ఏడు మంది దివ్యాంగులకు 56 వేల రూపాయలతో కొనుగోలు చేసిన మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య మాట్లాడుతూ పుల్లయ్య అంధత్వాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో స్టేట్ బ్యాంకులో ఉద్యోగం సాధించడమే కాకుండా తిరిగి దివ్యాంగులకు సహకరించాలని ముందుకు వచ్చి 56 వేలు విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం దివ్యాంగుల సంక్షేమానికి కృషిని నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలు అందజేయడం, ప్రతినెల అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పుల్లయ్యను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ,రమణయ్య లతో పాటు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి రామలింగం, ఉపాధ్యక్షులు వెంకటరావు, కార్యవర్గ సభ్యుడు మురళీధర్, సంఘం కార్యాలయ కార్యదర్శి ఆలా మధు, సలహాదారు శివరామిరెడ్డి,లబ్ధిదారుల బంధువులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు.

**- అక్రమ మద్యం స్వాధీనం --**
**మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన.**

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ముందస్తు నేర నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలన్న జిల్లా ఎస్పీ ధసునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు ఆయా సబ్ డివిజనల్ పోలీస్ అధికారుల సూచనలతో క్రింద తెలిపిన నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు.

ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, నాటు సారాయి, బెల్లం ఊటను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నారు.

1.నందికొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో....

నందికొట్కూరు పోలీస్ స్టేషన్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి షికారిపేటలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 20 నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 40 లీటర్ల బెల్లం మూటను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నారు.

2. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో..

కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి ముసలిమడుగు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 20 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నారు.

3. మిడ్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో..

మిడ్తూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కలమందలపాడు గ్రామంలో





కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా 25 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నారు.

4.కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని...

కోయిలకుంట్ల సీఐ ఆధ్వర్యంలో ఈరోజు తెల్లవారుజామున కోయిలకుంట్ల మండలం అమడాల గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐలు రేవనూరు, కోయిలకుంట్ల మరియు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 40 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం పై నాలుగు ప్రాంతాలలో గ్రామ ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించి,మాదకద్రవ్యాలు మరియు అక్రమ మద్యం వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేయించారు.

అలాగే సైబర్ మోసాల పట్ల అప్రమత్తత, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండటం, బాల్య వివాహాల నివారణ, మహిళల భద్రత, రోడ్డు భద్రత, శక్తి యాప్, డయల్-100/112 తదితర ప్రజా భద్రత అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు. అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# జూలేపల్లెలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఘనంగా భూమిపూజ.

**శంకుస్థాపన చేసిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**





పల్లె వెలుగు గోస్పాడు. గ్రామీణ ప్రజలకు ప్రాథమిక స్థాయిలో మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు . ఆదివారం గోస్పాడు మండల పరిధిలోని జూలేపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ హెల్త్ క్లినిక్' భవన నిర్మాణ పనులకు మంత్రివర్యులు ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్నచిన్న వ్యాధులకు, ప్రాథమిక పరీక్షలకు పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా స్వగ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కేంద్రం పూర్తయితే గ్రామ ప్రజలకు అవసరమైన ప్రాథమిక చికిత్సలు, మందులు, గర్భిణులకు పరీక్షలు, అత్యవసర ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను వెచ్చిస్తూ ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఫరూక్ తెలిపారు

ఈ కార్యక్రమంలో దీబగుంట్ల సొసైటీ చైర్మన్ నలిపెల ఓబులరెడ్డి , కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్ , సుబ్బయ్య మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కూటమి నాయకులు, జూలేపల్లె గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 31న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లా ప్రజల



సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 31వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు.ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే ఎవవనిశీయిఎ.ఖజూ.ప్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు.అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు.జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడంలేదా ?

**-రాయలసీమ ప్రాంతానికి నీటి విడుదల ఎప్పుడు..**

**-మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు దాటి మూడవ సంవత్సరంలో పాలన మరింత దారుణంగా మారిందని, మొదటి సంవత్సరంలో పంటనష్టం, రెండవ సంవత్సరం గిట్టుబాటు ధరలు లేవని, ఈ సంవత్సరం పంటలు సాగుచేయలేని దుర్భిక్షపరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా? రాయలసీమ ప్రాంతానికి ఎప్పుడు నీటి విడుదల చేస్తారో అధికారులు సమాధానం చెప్పాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ లో 873 అడుగుల నీటి నిల్వలు ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగునీరు, త్రాగునీరు వదలాలని ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల మండలం కానాల చెరువును మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ...కానాల చెరువులో చుక్కనీరు లేక ఎండిపోయిన పరిస్థితి ఉన్నదని, గత రెండు సంవత్సరాలుగా రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్న తరుణంలో ఈ ఏడాది అయినా ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేస్తారని ఆశగా ఎదురు చూసిన రైతన్నల ఆశలు అడిఆశలుగా మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులే రైతులను పంటలు సాగు చేయవద్దని చెప్పడం జరిగిందని, పంటలు సాగు చేయని పక్షంలో ప్రత్యామ్నాయ వనరులను కల్పించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90శాతం పూర్తి చేస్తే కేవలం 10శాతం మాత్రం







పూర్తి చేయాల్సి ఉండగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను నిలిపివేయడం ఒక దొంగచాటు వ్యవహారమని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంలో సాగునీరు లేక రైతులు పంటలు పండించని పరిస్థితి, ఇక గ్రామాల్లో త్రాగునీరు లేక పశువులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ దారుణమైన పరిస్థితిని గమనించి ప్రభుత్వం దిగువకు నీటిని వదిలి రాయలసీమ ప్రాంత వాసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం పంటల ఇన్స్యూరెన్స్ లేదని, అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదని విమర్శించారు. కానాల చెరువులో మట్టి త్రవ్విన గుంతలు కనిపిస్తున్నాయని, ఈ చెరువులో మట్టిని ఏప్రాజెక్ట్ కు అవసరం అయి చేశారు? ఈ మట్టి వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ఎంత? మైనింగ్ వారికి ఎంత ముట్టింది? ఇరిగేషన్ వారికి ఎంత అందింది? చెప్పాలని, ఈ విషయంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం అంతా అధికారుల నిర్లక్షానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగారావు,పిడి ఉసేన్,శంకర్, రంగారావు, కాసిం,మరియధాస్,కరీం,ఫక్రుదిన్, అల్లూరయ్య, సన్నా, జమాల్ బాషా, ఫరూక్, నాగవుశేని, మధు గౌడ్, పకీర్ సా, గ్రామ రైతులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# నంద్యాల నియోజకవర్గంలో ఇళ్లు లేని వారికి ఇచ్చిన పట్టాలను లాక్కొని వారికి అన్యాయం చేయకండి? మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి .

పల్లె వెలుగు నంద్యాల రూరల్. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో నంద్యాల మండలం కానాల



గ్రామంలో ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలను పంపిణీ చేయడం జరిగిందని, అయితే అధికారంలో ఉన్న ఈ కూటమి వద్ద ప్రభుత్వం వారికి ఇచ్చిన పట్టాలను తరిగి వెనక్కి ఇవ్వాలని, వారి వద్ద నుండి ఇళ్లపట్టాలను లాక్కొనాలని చూడటం దారుణంగా ఉందని, ఇది వారిలో అబద్రతా భావాన్ని, భయాందోళనకు గురిచేస్తున్నదని ఇది సరైన పద్దతి కాదని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. ఇళ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఇళ్లపట్టాల వ్యవహారంలో వారి మధ్యలో గొడవలు సృష్టించవద్దని హితవుపలికారు. ఇచ్చిన వారి వద్ద నుండి పట్టాలను తీసుకొని వారి పొట్టకొట్టొద్దని కోరారు. రెండు సెంట్లు ఇస్తామని ఈ కూటమి ప్రభుత్వం చెబుతున్నదని, ఇవ్వాలని అయితే గతంలో ఇచ్చిన పట్టాలను గుంచుకొని రెండు సెంట్లు ఇస్తామని చెప్పడం దుర్మార్గమైన చర్యలన్నారు, తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నంద్యాలలో బొగ్గులైన్ నిర్వాసితులను మోసం చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ నేతలు చెప్పినట్లుగానే ప్రభుత్వ భూములు వందల ఎకరాలు ఉన్నాయని చెప్పారని వాటిని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. షుగర్ ప్యాక్టరీ స్థలాలను పేదలకు పంచిపెట్టాలని ఇది నాడు టీడీపీ నేతలు చెప్పిన మాటలేనని గుర్తు చేశారు. పేదలకు మంచి చేస్తే తాము అడ్డుకోబోమని స్పష్టం చేశారు. పేదలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగారావు, పిడి ఉసేన్, శంకర్, రంగారావు, కాసిం, మరియధాస్, కరీం,ఫక్రుదిన్, అల్లూరయ్య, సన్నా, జమాల్ బాషా, ఫరూక్, నాగవుశేని, మధు గౌడ్, పకీర్ సా, గ్రామ రైతులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో భీరలింగేశ్వరస్వామి కుంభోత్సవం

హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 30 హొళగుంద మండల కేంద్రంలోని ఈర్లకట్ట వద్ద







వెలసిన భీరలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడవ ఆదివారం సందర్భంగా కుంభోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కురువ సంఘం నాయకులు, కుల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలోని పెద్దబావి వద్ద గంగిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు బీరప్ప డోలు, మేళతాళాల నడుమ కుంభాలను పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి భీరలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో స్వామివారికి ఆకుపూజ, అభిషేకం, నైవేద్య సమర్పణ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు, కులస్తుల కోసం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కుంభోత్సవంలో హొళగుంద గ్రామ కుల పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయం


హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 30 శ్రావణ మాసం మూడవ ఆదివారం సందర్భంగా దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని



ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వీర నాగప్ప, ఉప చైర్మన్ లుక్య నాయక్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలూరు తాలూకా ఏపీయూడబ్ల్యూజే సంఘం ఉపాధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు హెచ్. విరుపాక్షి, ఆయన సతీమణి హెచ్. మేనకారాణి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, పసుపు బండార అర్చన, పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు హెచ్. విరుపాక్షి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రావణ మాసం సందర్భంగా భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కలసపాడు ఎస్పీజీ చర్చికి కార్మిక శాఖ సూపరింటెండెంట్ జ్యోతి కుమారి సందర్శన

కలసపాడు, ఆగస్టు 30 ( పల్లె వెలుగు) మండల కేంద్రమైన కలసపాడులో సగిలేరు నది ఒడ్డున ఉన్న ఎస్పీజీ పరిశుద్ధ పేతురు--పరిశుద్ధ పౌలు దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర



కార్మిక శాఖ సూపరింటెండెంట్ ఎరమల జ్యోతి కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ విశిష్టత, చారిత్రక నేపథ్యం గురించి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం దేవాలయ గురువులు రెవరెండ్ ఆశిష్ గాబ్రియేల్, రెవరెండ్ అక్కిదాసరి జాన్సన్ విజయ్ కుమార్, కమిటీ సభ్యులు బత్తుల కిషోర్, పెద్దిటీ సైమన్, కలసపాటి రత్నరాజు, ఉపాధ్యాయుడు కారు జె. ప్రవీణ్ కుమార్ (చిన్ను) తదితరులు జ్యోతి కుమారిని ఘనంగా సన్మానించారు.

## రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు సువర్ణ అక్షరాలతో

# లిఖించబడతాయి

**ధర్మవరంలో జరగబోయే రోటరీ క్లబ్ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం**
**దేవిశెట్టి హరీష్ బాబు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి**

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 30 పల్లె వెలుగు రోటరీ క్లబ్ సేవలు చరిత్రలో సువర్ణ అక్షరాలతో





లిఖించబడతాయని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దేవిశెట్టి హరీష్ బాబు అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి అన్నారు అలాగేసెప్టెంబర్ ధర్మవరంలో జరగబోయే రోటరీ క్లబ్ సమావేశాన్ని జయప్రదం చేద్దామని తెలిపారు ఈ సందర్భంగా. ఆదివారం నాడు పట్టణంలోని రోటరీ క్లబ్బు సమావేశ మందిరంలో సాధారణ సమావేశం జరిగింది.
సమావేశానికి అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి సెక్రెటరీ గాండ్ల చంద్రసేన అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆనవాయితి ప్రకారం రోటరీ క్లబ్ ప్రార్థనతో మౌనం పాటించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను గురించి మాట్లాడుతూ రోటరీ క్లబ్ పెద్దలందరి సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. దేవిశెట్టి హరీష్ బాబు మాట్లాడుతూ ధర్మవరంలో జరగబోయే కార్యక్రమానికి ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ నుండి ఒకరోజు ముందుగానే సమావేశాలకు వెళ్లాలని అక్కడ జరగబోయే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. అలాగే రోటరీ సంబంధించిన కార్యక్రమాలను తదితర అంశాలను క్షుణ్ణంగా తెలిపారు. అనంతరం
రోటరీ క్లబ్ సీనియర్లు రిటైర్డ్ ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి చార్టెడ్ ప్రెసిడెంట్ పాపి రెడ్డి
కేవీ సుబ్బారెడ్డి బ్యాంకు బాలిరెడ్డి రోటికి క్లబ్ కి సంబంధించి పలు అమూల్యమైన సలహాలను సూచనలను వారు తెలిపారు. రోటరీ క్లబ్ లక్కీ డ్రా లో మొదటి బహుమతి ఎమ్మెస్ నారాయణ రెడ్డి రెండవ బహుమతి సిద్ధం రెడ్డి వెంకట్రాం రెడ్డికి పాస్ట్ ప్రెసిడెంట్ టీఎస్ సత్యనారాయణ బహుమతులను విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ మాటీవీ,ప్రసాద్ ,బండారు దస్తగిరి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి ,నిచ్చెనమిట్ల రామయ్య పాల్గొన్నారు.

## నారోగ్యంతో ఉన్న దావూద్ బాషా తండ్రికి పరామర్శ

రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు దావూద్ బాషా గారి తండ్రి గారి ఆరోగ్య పరిస్థితి విషమంగా



ఉందని తెలుసుకున్న టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి గారు వారి నివాసానికి వెళ్ళి నేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన దావూద్ బాషా గారి తండ్రి గారి ఆరోగ్యం గురించి, అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెబుతూ, త్వరలోనే ఆయన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజుల పెంపు

**● రెండున్నర ఏళ్లు గడిచిన ఒక్క మెడికల్ కాలేజీ ని కూడా పూర్తి చేయలేని కూటమి ప్రభుత్వం.. ● పిపిపి పేరుతో కాలక్షేపం ● విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. భరత్ కుమార్**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండున్నరసంవత్సరాలు కావస్తున్న ఇంత వరకు ఒక్క మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు చేయకుండా అదనంగా వీడీదీూ,దీణూ ఫీజులు పెంచడం పేద విద్యార్థుల వైద్య విద్య కు గొడ్డలి పెట్టు వేయడమే అని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. భరత్ కుమార్ గారు ఆదివారం ఒక ప్రకటన లో ఆవేదన వ్యక్తం చేశారు, మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని కొనసాగించకుండా పీపీపీ పేరుతో కాలయాపన చేస్తూ కూటమి ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు, మొన్న మెడికల్ అడ్మిషన్లు కు సంబంధించి రిజర్వేషన్ విద్యార్థులకు అన్యాయం చేస్తూ జీవో నెంబర్ 102 ను తీసుకొచ్చిందని నేడు విద్యార్థులకు భారం అయ్యే విధంగా ఏ, బి, సి కేటగిరీలో చదివే విద్యార్థులకు ఫీజులు పెంచడం దారుణం అని ఆవేదన వ్యకం చేశారు, పెంచాల్సింది ఫీజులు కాదని వీడీదీూ సీట్లు తెలిపారు, కూటమి ప్రభుత్వం పూర్తిగా విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం అని ఆవేదన వ్యక్తం చేశారు, ఎన్నికల ముందు చెప్పింది ఒకటి గెలిచాక చేసింది ఒకటి అని ఎద్దేవ చేశారు, కోర్టు ఆదేశాలు జారీ కాకముందే ఫీజులు పెంచడం విడ్డూరం అని ఆవేదన వ్యక్తం చేశారు, పెరిగిన ధరలకు అనుగుణంగా జూనియర్ డాక్టర్ ల స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేసారు.

## అక్రమ మట్టి తరలింపుపై తహసీల్దార్ యాదగిరి రెడ్డి

# ఆదేశాలతో దాడులు



**సెలవు రోజైనా వెనక్కి తగ్గని రెవెన్యూ అధికారులు.. మూడు లారీల వెంటనే సీజ్**
**మట్టి దందా వెనుక ఎవరు? మెట్టు నర్సింహా హస్తముందా? స్థానికుల ఆరోపణలు**
**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: ఆర్ఐ విశ్వనాథ్**

కీసర, పల్లె వెలుగు దినపత్రిక.(ఆగస్టు 30): కీసర మండలం రాంపల్లి దాయరలోని సర్వే నంబర్ 633లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారన్న నిఘా సమాచారంతో మండల తహసీల్దార్ యాదగిరి రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు.
తహసీల్దార్ మార్గదర్శకత్వంలో సెలవు రోజును సైతం లెక్కచేయకుండా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) విశ్వనాథ్, జీపీఓ రమాకాంత్‌తో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ు+ 07 శ 9721, ు+ 07 శ 6700, యా 08 ఖఖ 0216 నంబర్లతో ఉన్న మూడు లారీలను అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అయితే దాడుల సమయంలో లారీలు డ్రైవర్లు సహకరించక పోవడంతో వాటిని అక్కడే వదిలేసినట్లు తెలిసింది. అలాగే మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశంలో రెండు హిటాచీలు, రెండు కంప్రెషర్ యంత్రాలు ఉన్నట్లు సమాచారం.

**ఎక్స్‌కవేటర్లు అదుపులోకి.. నివేదిక అందజేత:**

ఈ సందర్భంగా ఆర్ఐ విశ్వనాథ్ మాట్లాడుతూ.. తహసీల్దార్ యాదగిరి రెడ్డి ఆదేశాలతో రాంపల్లి దాయరలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మట్టి తవ్వకాలకు ఉపయోగిస్తున్న 'హ్యుందాయ్ రోబెక్స్ 210-7', మరొక ఎక్స్‌కవేటరును కూడా అదుపులోకి తీసుకుని, ఈ ఆకస్మిక దాడులు మరియు అక్రమ తవ్వకాలపై తహసీల్దార్‌కు సమగ్ర నివేదిక సమర్పిస్తామన్నారు. ప్రభుత్వ



నిబంధనలను ఉల్లంఘించి అక్రమ మట్టి దందాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**మట్టి దందా వెనుక ఎవరు?:**

ఇదిలా ఉండగా, సర్వే నంబర్ 633లో జరుగుతున్న అక్రమ మట్టి తరలింపు వెనుక మెట్టు నర్సింహా హస్తం ఉందంటూ కొందరు స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.
"అక్రమ మట్టి దందా వెనుక ఆయనే ఉన్నారా?" అని స్థానికంగా ముమ్మరంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ కావలసి ఉంది.
మట్టి తవ్వకాలు, తరలింపుల వెనుక అసలు సూత్రధారులు ఎవరు? ఎంత పరిమాణంలో




మట్టిని తోడేశారు? ఎవరి అనుమతులతో ఈ దందా సాగింది? అనే కోణాల్లో తహసీల్దార్ యాదగిరి రెడ్డి పర్యవేక్షణలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపాల్సి ఉంది. విచారణలో ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలి

**-కుల వివక్ష నిర్మూలనకు అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలి... -ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్**






విజయవాడ, బ్యూరో చీఫ్ ఆగస్టు 30: పల్లె వెలుగు సమాజంలో దళితుల పట్ల కొనసాగుతున్న అసమానతలు, వివక్ష తొలగిపోయేలా ప్రతి దళిత కుటుంబానికి న్యాయం అందించేందుకు ఎస్సీ మోర్చా లీగల్ సెల్‌లోని న్యాయవాదులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ పిలుపునిచ్చారు. అక్రమ కేసుల్లో చిక్కుకుని సరైన న్యాయం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దళితులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించాలని సూచించారు.
విజయవాడలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా లీగల్ సెల్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నూకల మధుకర్ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా విజయవాడ బార్ కౌన్సిల్ సభ్యులు, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పాలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ పాల్గొన్నారు.

**అంబేద్కర్ ఆశయాలను ఆచరణలోకి తేవాలి**

ఈ సందర్భంగా నూకల మధుకర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన జీవితంలో ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్నప్పటికీ వాటికి వెరవకుండా తన జీవితాన్ని తాను కోరుకున్న రీతిలో మలుచుకుని దేశానికి మార్గదర్శకమైన రాజ్యాంగాన్ని అందించారని గుర్తుచేశారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు.
రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకుని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. బహిరంగ వేదికలపై కుల వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న కొందరు, ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మాటలకు, చేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని సమాజంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**ప్రతి జిల్లాలో న్యాయ సహాయ వ్యవస్థ**

పనతల సురేష్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో అన్ని మోర్చాలకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ మోర్చాకు అనుబంధంగా లీగల్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.
రాష్ట్రస్థాయి కన్వీనర్‌గా డాక్టర్ అశోక్‌ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్సీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్లు సమావేశంలో పాల్గొన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, న్యాయపరమైన సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవాలని, న్యాయ సహాయం అందించి మెరుగైన జీవితానికి బాటలు వేయాలని కోరారు.
ఈసమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వుల్లూరి గంగాధర్, జోనల్ ఇన్‌చార్జి మేకల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజు, పార్టీ లీగల్ సెల్ సభ్యుడు చె. ఉమామహేశ్వరరెడ్డి ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్ బి రాజేష్ కుమార్, నంద్యాల జిల్లా ఎస్సీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్ బిజ్జం వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ. 20 లక్షలతో పనులు ప్రారంభం: ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు30(పల్లె వెలుగు దినపత్రిక):



కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు ఆదివారం శాస్త్రోక్తంగా శంకుస్థాపన జరిగింది. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయ అభివృద్ధి కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ. 20 లక్షల ని ద , ు ల ు మంజూరయ్యాయి. ఈకార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ శ్రీరాముడు ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతిరూపమని, ఆదర్శవంతమైన పాలన అందించిన శ్రీరాముడి ఆలయాన్ని పునఃనిర్మించడం గ్రామ ప్రజలకు ఎంతో శుభపరిణా మమని పేర్కొన్నారు. శతాబ్ద కాలం నాటి ఈ పురాతన దేవాలయానికి పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ. 20 లక్షలు కేటాయించినట్లు



తెలిపారు. రామాలయం ఉన్న ప్రాంతంలో సుఖశాంతులు, ఐకమత్యం వర్ధిల్లుతాయని, గ్రామస్తులు, దాతలు, భక్తులు సమన్వయంతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్, ఎస్.వి.ఎస్. అప్పలరాజు, కొత్త కొండబాబులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న మాజీ న్యాయ మూర్తులు

పెదపూడి/గొల్లల మామిడాడ, ఆగస్ట్ 30 (పల్లె





వెలుగు దినపత్రిక) ప్రతినిధి పల్లపాటి శిరీష్ కుమార్: గొల్లలమామిడాడ సూర్యదేవుని సన్నిధిలో మాజీ న్యాయమూర్తులు జస్టిస్ శేషశయన రెడ్డి, జస్టిస్ కె.సి.భాను

కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామంలో కొలువై ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ శ్రీ ఉషా పద్మిని ఛాయా సౌజ్ఞా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం మాజీ న్యాయమూర్తులు దర్శించుకున్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ బి. శేషశయన రెడ్డి, జస్టిస్ కె.సి. భాను తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేశారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మాజీ న్యాయమూర్తులకు ఆలయ అర్చకులు రాంబాబు, పురుషోత్తం సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభం తో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ న్యాయ మూర్తులతో కలిసి లా చదువుకున్న వారి సహాధ్యాయి, కాకినాడకు చెందిన సీనియర్ న్యాయవాది బొగ్గవరపు గోకులకృష్ణ, వారి జూనియర్ న్యాయవాదులు, స్థానిక న్యాయవాది లయన్ మండ రాజారెడ్డి పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాజీ న్యాయమూర్తులు మాట్లాడుతూ.. భానుడికి అత్యంత ప్రీతిపాత్రమైన ఆదివారం పవిత్ర దినాన శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా, తమ అదృష్టంగా భావిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ప్రశాంత వాతావరణం, ఆధ్యాత్మిక వైభవం ఎంతో మనశ్శాంతిని కలిగించాయని వారు పేర్కొన్నారు.

## ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా విప్పర్తి నిఖిల్ కృష్ణ ఏకగ్రీవ ఎన్నిక.

పిఠాపురం, ఆగస్ట్30(పల్లె వెలుగు దినపత్రిక):





పిఠాపురం పట్టణానికి చెందిన విజయవాడ లోని ఏఐటీయూసీ భవనము నందు రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల గురించి చర్చించడంతోపాటు, రాబోయే రోజుల్లో ఉద్యోగుల హక్కుల కోసం ఏ విధంగా సమాయత్తం అవ్వాలో చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయం అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 13/2020 నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించడం జరిగింది. ఈ కమిటీ లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుండి రాష్ట్ర అధ్యక్షుడిగా విప్పర్తి నిఖిల్ కృష్ణ ,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా దారపురెడ్డి తాతాజీ రావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ లు గా షేక్ మహబూబ్ భాష, జాన్ కృష్టొపర్ ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా అధ్యక్షులుగా పెయ్యల సతీష్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా పట్టాభి, కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా సామంత్ సక్సేన నియమించడంజరిగింది. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు విప్పర్తి నిఖిల్ కృష్ణ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం 2020 నుండి ఇప్పటివరకు ఎంత నిజాయితీగా,నిబద్ధత తో పనిచేశామో అంతకన్నా చాలా బలంగా పోరాటం చేస్తామని, ప్రభుత్వంతో , ప్రభుత్వ అధికారులతో సానుకూల ఫలితాలు వచ్చేలా చర్చల ద్వారా ఫలితాలు వచ్చేలా కృషిచేస్తామని, ప్రభుత్వం వెంటనే సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్ ప్రక్రియ, ాూూూ,నోషనల్ ఇంక్రిమెంట్ వెంటనేపరిష్కరించాలని. అదేవిధంగా గత రెండున్నర సంవత్సరాలలో చనిపోయిన సచివాలయ ఉద్యోగుల గురించి ఎంక్వయిరీ కమిటీ నియమించి చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని తెలియజేశారు.

# నరసన్నపేటలో ఘనంగా జిల్లా స్థాయి గట్కా పోటీలు

శ్రీకాకుళం జిల్లా/నరసన్నపేట, ఆగస్ట్ 30(పల్లె



వెలుగు దినపత్రిక):నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (హైస్కూల్) ప్రాంగణంలో శ్రీకాకుళం జిల్లా స్థాయి గట్కా ఛాంపియన్‌షిప్ పోటీలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతీయ సంప్రదాయ యుద్ధ కళ అయిన 'గట్కా' విద్యార్థులలో శారీరక దృఢత్వాన్ని, ఆత్మరక్షణ నైపుణ్యాన్ని, మానసిక ఏకాగ్రతను పెంపొందిస్తుందని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇలాంటి ప్రాచీన యుద్ధ విద్యల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించు కోవచ్చని సూచించారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు ఇలాంటి ఛాంపియన్‌షిప్ పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు తమ అద్భుత విన్యాసాలు, ప్రతిభతో ఆకట్టుకున్నారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బగ్గు అర్చన అభినందనలు తెలియజేసి, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. భవిష్యత్తులో వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గట్కా క్రీడా సంఘం ప్రతినిధులు, శిక్షకులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు మరియు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ! మేడిశెట్టి విజయ్

గాజువాక, ఆగస్ట్30(పల్లె వెలుగు దినపత్రిక): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించు కుని గాజువాక 79వ వార్డులో విస్తృత స్థాయిలో సేవా, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు జనసేన శ్రేణులు సమాయత్త మయ్యాయి. సెప్టెంబర్ 2న జరగనున్న పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల ఏర్పాట్లపై 79వ వార్డు జనసేన పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేడుకల వివరాలను వెల్లడించారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు ఉపయోగపడే అనేక సామాజిక, సేవా మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఘనంగా జరపాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఇప్పటికే




విద్యార్థులలో పర్యావరణ స్పృహను పెంపొందించేందుకు ప్రత్యేకంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి నట్లు మేడిశెట్టి విజయ్ పేర్కొన్నారు. ఈ పోటీలకు స్థానిక పాఠశాలల విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని, పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారని కొనియాడారు. సమావేశం అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ జనసేన నేతలు ప్రత్యేక ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 2న వార్డు పరిధిలో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నారాపిన్ని అప్పలరాజు, తలారి సన్యాసిరావు, నున్న కిరణ్ కుమార్, మింది నరేష్, గల్లా జగదీశ్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అభయాంజనేయ స్వామి ఆలయం ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట,ఆగస్టు30(పల్లె వెలుగు ప్రతినిధి): జగ్గంపేట మండలం రాజపూడి శివారు



సీతారాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆలయాన్ని ప్రారంభించి ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వెయ్యి మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గ్రామస్తులందరూ కలిసి గ్రామ ముఖ ద్వారం వద్ద అభయాంజనేయ స్వామి ఆలయం నిర్మించుకోవడం గ్రామానికి శుభసూచకమని అన్నారు. ఆంజనేయ స్వామి కొలువుదీరిన చోట దుష్టశక్తులు ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను, గ్రామస్తులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రేఖ బుల్లి రాజు, గుడివాడ రాజారావు గల్లా శ్రీను, గల్లా వీర్రాజు ( బాబ్జి) గుడివాడ శివ,అప్పికొండ రమణ, పక్కుర్తి గంగరాజు, మడగల హరికృష్ణ, రాయి సింగర్రావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధి,పార్టీ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలి: బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివ

పెదపూడి/ గొల్లల మామిడాడ, ఆగస్ట్ 30(పల్లె వెలుగు దినపత్రిక) ప్రతినిధి పల్లపాటి శిరీష్ కుమార్:భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని



క్షేత్రస్థాయిలో బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శివ కార్యకర్తలతో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రసార మాధ్యమాల ద్వారా ప్రధాని సందేశాన్ని ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని, ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు అందరూ విభేదాలు వీడి ఐక్యంగా ముందుకు సాగాలని, అంకితభావం తో పనిచేయాలని ఆయన కార్య కర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జిల్లా ఉపాధ్యక్షుడు కర్రి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయ వంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో మండల జనరల్ సెక్రటరీ మల్లెడి రామారెడ్డి, మండల యువమోర్చా నాయకుడు దుర్గాప్రసాద్, కిసాన్ మోర్చా నాయకుడు కొవ్వూరి కృష్ణారెడ్డిలతో పాటు జిల్లా స్థాయి నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### నేడు జిల్లా పోలీస్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు: ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి ఆగస్ట్30(పల్లె వెలుగు దినపత్రిక)జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.?సెప్టెంబర్ 2వ తేదీన



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాయకరావుపేట మండలంలో పర్యటించనున్నారు. అక్కడ నిర్వహించే 'జల హారతి' కార్యక్రమంలో సీఎం పాల్గొననున్న నేపథ్యంలో, జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారు. ఈ కారణంగా సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు, అర్జీదారులు గమనించి పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ తుహిన్ సిన్హా కోరారు.

## అనకాపల్లిలో వరుస దొంగతనాల గుట్టురట్టు ! నిందితుల అరెస్ట్, సొత్తు స్వాధీనం

అనకాపల్లి, ఆగస్ట్30 (పల్లె వెలుగు దినపత్రిక)పట్టణ పరిధిలో ఇటీవల వరుస చోరీలకు పాల్పడుతూ ప్రజలను బెంబేలెత్తిస్తు న్న నిందితులను టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన



వివరాల ప్రకారం, బీఆర్టీ కాలనీకి చెందిన ముప్పిడి రాజు అలియాస్ జైరాజు అనే పాత నేరస్థుడిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు చోరీల గుట్టు బయటపడింది. ఎన్టీఆర్ గ్రౌండ్ వద్ద పార్క్ చేసిన స్కూటీ డిక్కీ పగులగొట్టి రెండు విలువైన సెల్‌ఫోన్లు, అలాగే చోడవరం నాయుడు జ్యువెల్స్ పార్కింగ్ ప్రదేశంలో మరో స్కూటీ డిక్కీ నుంచి ?5,000 నగదును దొంగిలించినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని న్యాయస్థానం లో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. మరోవైపు, అనకాపల్లి రైల్వే స్టేషన్ పార్కింగ్ స్థలంలో ఒకటి, సమీపం లోని అన్నా క్యాంటీన్ వద్ద మరొకటి చోరీకి గురైన ద్విచక్ర వాహనాల కేసులను కూడా పోలీసులు ఛేదించి వాహనాలను రికవరీ చేశారు. వరుస చోరీ కేసులను వేగంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న టౌన్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా,ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఇంజరంలో సెప్టెంబర్ 6న ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్ళరేవు, ఆగస్టు 30పల్లె వెలుగు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్ళరేవు మండలం ఇంజరం గ్రామంలో సెప్టెంబర్ 6వ తేదీ ఆదివారం నాడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కెవిఆర్ అంజలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరం జరగనుందని ట్రస్ట్ నిర్వాహకులు కాకరపర్తి వెంకటరావు, పూర్ణిమ దంపతులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంజరం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన రోగులకు ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేయడంతో పాటు శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేయించనున్నట్లు వారు వివరించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. శిబిరానికి వచ్చే ప్రజలు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్ లేదా ఇతర అధికారిక గుర్తింపు పత్రం జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలని కాకరపర్తి వెంకటరావు, పూర్ణిమ దంపతులు కోరారు

## బలభద్రపురం వారాహి అమ్మవారికి వెండి కాసుల పేరు సమర్పణ

బిక్కవోలు/అనపర్తిని యోజికవర్గ ప్రతినిధి కర్రి దుర్గారెడ్డి, ఆగస్ట్30 పల్లె వెలుగు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామం లోని శ్రీ భూగర్భ వారాహి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల తనయుడు, రాజమహేంద్రవరంలోని గౌతమ్ యూరాలజీ అండ్ కిడ్నీ సెంటర్ అధినేత, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి, ప్రియాంక దంపతులు వారాహి అమ్మవారికి 500 గ్రాముల వెండితో తయారు చేసిన కాసుల పేరును భక్తిశ్రద్ధలతో సమర్పించారు.అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. వెండి కాసుల పేరును అమ్మవారికి అలంకరించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారి విశిష్టతను, ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి కానుకలు సమర్పించడం ద్వారా తమ మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.కార్యక్రమంలో కొవ్వూరి వెంకటరామారెడ్డి, వరలక్ష్మి దంపతులు, చిరంజీవి శ్రీకర్, నల్లమిల్లి వెంకటరెడ్డి (నేషనల్), భారతి దంపతులు, వెంకటేశ్వర రైస్ మిల్ నంబర్ వన్ అధినేత నల్లమిల్లి అచ్చుతా రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## బి.ఎన్. కండ్రిగలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మల తొలగింపు.. ట్రాఫిక్ పునరుద్ధరణ

బి.ఎన్. కండ్రిగ (తిరుపతి జిల్లా), ఆగస్ట్ 30పల్లె వెలుగు శ్రీకాళహస్తి -- బి.ఎన్. కండ్రిగ ప్రధాన రహదారిలోని పుట్టా సెంటర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో భారీ చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.విషయం తెలుసుకున్న బి.ఎన్. కండ్రిగ ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ, స్థానికుల సహకారంతో రోడ్డుకు అడ్డంగా పడిన కొమ్మలను త్వరితగతిన తొలగించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రజల రక్షణ, రహదారి భద్రత కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తక్షణ చర్యలు చేపడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. సకాలంలో స్పందించి ఇబ్బందులు కలగకుండా చూసిన పోలీసులను స్థానికులు, వాహనదారులు అభినందించారు.



## యానాంలో అట్టహాసంగా మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ లీగ్ పోటీలు

యానాం, ఆగస్టు 30 పల్లె వెలుగు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా యానాంలో మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ప్రీమియర్ లీగ్--2026 పోటీలను ఘనంగా నిర్వహించారు. యానాం రీజియన్ హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో, హాకీ పుదుచ్చేరి అనుబంధంతో స్థానిక జీఎంసీ బాలయోగి గ్రౌండ్‌లో ఈ టోర్నమెంట్ జరిగింది. మొత్తం ఐదు జట్లు పాల్గొన్న ఈ పోటీలు కోచ్ అశ్విన్ పర్యవేక్షణలో ఉత్కంఠభరితంగా సాగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివరాజ్ మీనా, డి. సురేష్ బాబు, మల్లాడి సామిల్ హాజరై క్రీడాకారులను అభినందించారు. అనంతరం విజేత జట్లకు శివరాజ్ మీనా బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించాలని, యానాంలో హాకీ క్రీడాభివృద్ధికి మరిన్ని అవకాశాలు, తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల విజయవంతానికి అనురాగ ఆదర్శ శేషసుమన్, సుంకర కార్తీక్, బొమ్మిడి కామేష్, ఆకుల జయదేవ్, ఎర్రబండి స్వామి, ఎస్. రఘురాం, పి. సంతోష్ స్పాన్సర్లుగా వ్యవహరించి సహకారం అందించారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ ప్రతినిధులు, నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




## రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్ళరేవు, ఆగస్టు 30 పల్లె వెలుగు దినపత్రిక) కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం గాడిమొగ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన దృష్టి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో స్థానిక ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు అందిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




## చోడవరం--రోలుగుంట బీ.ఎన్. రహదారి నిర్మాణంపై గ్రీవెన్స్ ఫిర్యాదుకు స్పందన



రావికమతం,ఆగస్టు30 (పల్లె వెలుగు దినపత్రిక ప్రతినిధి): చోడవరం నుంచి రోలుగుంట వరకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న బీ.ఎన్. రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన నవర శ్రీనివాసు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఒక నియోజకవర్గం--నాలుగు పర్యటనల కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ ఫిర్యాదును సమర్పించినట్లు తెలిపారు. ఫిర్యాదుపై స్పందించిన మాడుగుల ఆర్ అండ్ బీ సెక్షన్ జూనియర్ ఇంజినీర్ శ్రీనివాస్ ఆదివారం మేడివాడ గ్రామానికి చేరుకుని ఫిర్యాదుదారు నవర శ్రీనివాసును కలిశారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ పనులను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తిచేస్తామని జె.ఈ. హామీ ఇచ్చినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని జె.ఈ.ను కోరారు. పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగితే మరోసారి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చోడవరం నుంచి రోలుగుంట వరకు బీ.ఎన్. రహదారి నిర్మాణాన్ని పూర్తిచేస్తామ ని స్థానిక శాసనసభ్యుడు, పార్లమెంట్ సభ్యుడు హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు రెండేళ్లు పూర్తయి మూడో సంవత్సరం కొనసాగుతున్నా రహదారిపై ఏర్పడిన గుంతలను సైతం పూర్తిస్థాయిలో పూడ్చలేని దుస్థితి నెలకొందని పలు ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. చోడవరం నియోజకవర్గంలో బీ.ఎన్. రహదారి సమస్యతో పాటు మారుమూల ప్రాంతాలకు అనుసంధానమయ్యే తట్టబంధ, తోటకూరపాలెం తదితర గ్రామాల రహదారులు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని వారు పేర్కొంటున్నారు. బ్రిటిష్ పాలనా కాలంలో విజయరామరాజుపేట, వడ్డాది గ్రామాల సమీపంలో బీ.ఎన్. రహదారిపై నిర్మించిన వంతెనలు సైతం సుమారు మూడేళ్ల క్రితం పూర్తిగా కూలిపోయాయని, వాటి పునర్నిర్మాణానికి ఇప్పటివరకు ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో చోడవరం నియోజకవర్గం అభివృద్ధి పరంగా వెనుకబడి ఉందని ప్రజా సంఘాలు, స్థానికులు విమర్శిస్తున్నారు. సంక్షేమ పథకాల విషయం పక్కనపెడితే కనీస మౌలిక వసతుల అభివృద్ధిపైనైనా ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు. ఎన్నికలకు ముందు ఒక విధంగా, ఎన్నికల అనంతరం మరో విధంగా మాట్లాడటం ద్వారా ప్రజలను మభ్యపెడుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా చోడవరం నియోజకవర్గంలోని రహదారులు, వంతెనలు తదితర మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాలు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కల్యాణపులోవ రిజర్వాయర్‌కు న్యాయం జరిగేనా?

రావికమతం,ఆగస్టు30 పల్లె వెలుగు దినపత్రిక ప్రతినిధి): మండలంలోని చీమలపాడు పంచాయతీ



పరిధిలో గల కల్యాణపులోవ రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో కొంతకాలం గా ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిజర్వాయర్ పరిధికి సంబంధించిన ఎఫ్‌ఎంబీ లేదంటూ రెవెన్యూ, సర్వే అధికారులు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి భూమికి ఎఫ్‌ఎంబీ ఉంటుందని, రిజర్వాయర్ విషయంలో ఎఫ్‌ఎంబీ లేదని అధికారులు పేర్కొనడానికి కారణమేమిటని వారు ప్రశ్ని స్తున్నారు.ఎన్నో సంవత్సరాలుగా రిజర్వాయర్ ఆధీనంలో ఉన్న భూములు క్రమంగా ఆక్రమణకు గురవుతున్నప్పటికీ, ప్రస్తుతం మట్టితో పూడ్చి చదును చేస్తున్న భూమి జిరాయితీ భూమి అని పేర్కొనడం ఆశ్చర్యకరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ఎఫ్‌ఎంబీ వివరాలను వెలుగులోకి తీసుకురావడంతో మండల సర్వేయర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలోని సర్వే బృందం ఆదివారం రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో సర్వే నిర్వహించింది. అయితే సర్వే ప్రక్రియ తూతూ మంత్రంగా సాగుతోందని, రెవెన్యూ, సర్వే యంత్రాంగంపై తమకు విశ్వాసం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రిజర్వాయర్ పరిధిని పట్టపగలే మట్టితో పూడ్చి చదును చేస్తున్నా సంబంధిత అధికారులకు కనిపించడం లేదా అని ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. రిజర్వాయర్ పరిరక్షణకు అధికారులు ఎటువంటి చర్యలు చేపడుతున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రిజర్వాయర్ పరిధిలో జరుగుతున్న పరిణామాలపై పలు ప్రజా సంఘాలు, జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు స్పందించి ప్రభుత్వ, జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడం తోనే వ్యవహారం వెలుగులోకి వచ్చిందని స్థానికులు పేర్కొంటున్నా రు. ఈ నేపథ్యంలో రిజర్వాయర్ పరిధిపై సమగ్ర విచారణ జరిపి, పక్కా హద్దులను నిర్ధారించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రజా సంఘాలు, స్థానికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే రెవెన్యూ, సర్వే యంత్రాంగం సర్వే నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నా యని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను నిగ్గుతేల్చి, రిజర్వాయర్ పరిధిలోని రైతులకు న్యాయం చేయడంతో పాటు రిజర్వాయర్‌ను ఆక్రమణల నుంచి పరిరక్షించాలని వారు కోరుతున్నారు. ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టకపోయినా, చోడవరం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లకపోయినా జిల్లా యంత్రాంగం ఈ అంశంపై దృష్టి సారించేదా అనే సందేహం ఉందని స్థానిక ఆదివాసీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతోనే జిల్లా యంత్రాంగం స్పందించి ప్రస్తుతం విచారణ, సర్వే ప్రక్రియ చేపట్టిందని వారు పేర్కొన్నారు. కల్యాణపులోవ రిజర్వాయర్ భవిష్యత్తు దృష్ట్యా ఎటువంటి ఒత్తిళ్లకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా సర్వే నిర్వహించి, రిజర్వాయర్ వాస్తవ హద్దులను నిర్ధారించి, ఆక్రమణలు ఉన్నట్లయితే వాటిని తొలగించి జలవనరును పరిరక్షించాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## చెంజెస్ ఆధ్వర్యంలో కళా జాత ప్రదర్శన

పిఠాపురం, ఆగస్ట్ 30పల్లె వెలుగు పిఠాపురం దేశ




ప్రగతికి ఆటంకంగా ఉండి సమాజంలో అలజడి సృష్టిస్తున్న ఏయిడ్స్ మహమ్మారిని కేవలం అవగాహన ద్వారానే అంతమొందిం చాలని చెంజెస్ సంస్థ ఆధ్వర్యంలో కళాజాతల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు కాకినాడ చెంజెస్ ప్రాజెక్టు మేనేజర్ పి.దుర్గా భవాని తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫోర్ హెచ్.ఐ.వి ఎయిడ్స్ క్లస్టర్ కాకినాడ సంయుక్తంగా నిర్వహనలో అక్టోబర్ 15 వరకు కళా జాతర బృందాలతో వీధి నాటకముల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమములో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డి. ఎల్. ఏ. టి. వో ఎస్. చాలామయ్య ఆదేశాలతో, క్లస్టర్ ప్రాజెక్టు మేనేజర్ పి. బాలాజీ, క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.రామానాయుడు, చేంజెస్ కాకినాడ సంస్థ కే. పుష్పా కుమారి ఆధ్వర్యంలో యు.పిఠాపురం అర్బన్ మండలం, మున్సిపాల్ సెంటర్, రిక్షా స్థాండ్ కూడలి లో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ మరియు వ్యాధి ఎలా వస్తుంది.ఎలా వ్యాపించదు, సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి,హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి సుఖ వ్యాధులు, క్షయ వ్యాధి సంబంధం గూర్చి

వాటి చికిత్స గూర్చి కండోమ్ యొక్క ఉపయోగాలు గూర్చి ఆరోగ్య విషయాల పట్ల కళా జాతర ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ మాట్లాడతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా అనేకమందకి అవగాహనా కలుగుతుంది అని,భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు అనేకం జరగాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో చేంజెస్ కాకినాడ సంస్థ సిబ్బంది నాగదుర్గ, సుశీల, భవాని మరియు టీ. పవన్ కుమార్ కళాజాతర బృందం వారి సభ్యులు యం. రాణి, ఎన్. కుమారి, టీ. హర్షవర్ధన్ ప్రదర్శించిన ప్రదర్శను ఆశక్తితో తిలకించి కళా కారులను అభినందించ్చారు.ఈకార్యక్రమంలో ప్రేక్షకులు మరియు ఆరోగ్య సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమల తరహాలో వాడపల్లి దివ్యక్షేత్రం అభివృద్ధి

**టెంపుల్ సిటీగా వాడపల్లి అభివృద్ధికి ప్రణాళిక : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

వాడపల్లి, ఆగస్టు 30పల్లె వెలుగు

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మ, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపల్లి క్షేత్రాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రూ.6.25 కోట్ల సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులతో నిర్మించిన నూతన వకుళమాత అన్నదాన భవనాన్ని ఆదివారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వాడపల్లి ఆలయం ఒక్క కోనసీమ ప్రాంతానికే పరిమితమైన క్షేత్రం కాదని, దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదానం అన్ని దానాలకంటే గొప్పదని, స్వామివారి దర్శనానికి వచ్చే ఏ భక్తుడూ ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో ఇంత భారీ స్థాయిలో అన్నదాన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. నూతన భవనంలో ఒకేసారి సుమారు 2,000 నుంచి 2,500 మంది భక్తులు భోజనం చేసే సౌకర్యం ఉందని తెలిపారు. ఆధునిక వంట పరికరాలతో రోజుకు సుమారు 40 వేల మందికి ప్రసాదం సిద్ధం చేసే సామర్థ్యం కల్పించారని పేర్కొన్నారు. వాడపల్లి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని 'ప్రసాద్' (గ్రా=ూూూణ) స్కీమ్ ద్వారా నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఈ విషయంపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వాడపల్లి ఆలయానికి నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్, టీటీడీ నుంచి కూడా నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. దేవుడికి మనం దానం చేస్తున్నామనే భావన కాకుండా, మనకు లభించిన సంపదలో కొంత భాగాన్ని భగవంతుడికి సమర్పించుకునే అవకాశం కల్పించడం కూడా ఆయన అనుగ్రహమేనని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. పెరిగిన ఆలయ ఆదాయం... ప్రస్తుత పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగిందని కేంద్ర మంత్రి తెలిపారు. గతంలో శనివారం టికెట్ల ద్వారా సుమారు రూ.30 లక్షల ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం అది సుమారు రూ.కోటికి చేరిందని చెప్పారు. అలాగే గతంలో నెలకు సుమారు రూ.కోటి ఉన్న హుండీ ఆదాయం ప్రస్తుతం రూ.2 కోట్లకు చేరిందని వెల్లడించారు. భక్తుల్లో ఆలయంపై పెరిగిన నమ్మకం, విశ్వాసమే ఆదాయం పెరగడానికి ప్రధాన కారణమన్నారు. టెంపుల్ సిటీగా వాడపల్లి... ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ వాడపల్లి క్షేత్రం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. స్వామివారిని దర్శించుకుని సేవించిన భక్తుల కోరికలు నెరవేరుతున్నాయనే విశ్వాసంతో లక్షలాది మంది భక్తులు వాడపల్లికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తుల సంఖ్య దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతున్న నేపథ్యంలో వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా, వాడపల్లిని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందుతున్నట్లు చెప్పారు. రూ.8 కోట్లతో ఏటిగట్టు రహదారి... వాడపల్లి అభివృద్ధిలో భాగంగా భక్తుల రాకపోకలకు మరింత సౌకర్యవంతమైన రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరిన వెంటనే రూ.6 కోట్లను ఏటిగట్టు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశారని చెప్పారు. రావులపాలెం నుంచి ఏటిగట్టు మీదుగా వాడపల్లి వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.6 కోట్లతో పాటు రుడా నిధులు రూ.1 కోటి, పుష్కర నిధులు రూ.1 కోటి కలిపి మొత్తం రూ.8 కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు బండారు సత్యానందరావు వెల్లడించారు. అన్నదాన భవనానికి దాతల సహకారం.. నూతన వకుళమాత అన్నదాన భవనంలో సుమారు రూ.1.5 కోట్లతో ఆధునిక కిచెన్, భక్తులు కూర్చుని భోజనం చేసేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసిన పశ్చిమగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సమంతపూడి శ్రీరామరాజు, ఆయన బృందాన్ని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరో రూ.50 లక్షల సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చినందుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వాడపల్లి ఆలయాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, ఆలయ పాలకమండలి సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణ, కొత్తపేట జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, యాళ్ల దొరబాబు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు





# దోపిడీకి పదవి అడ్డా!



## పాప జాకీర్.. దోచేస్తున్నాడు ఆటోనగర్ !

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

నంద్యాలకు చెందిన పాప జాకీర్ ఆటోనగర్ అధ్యక్ష పదవిని అడ్డం పెట్టుకొని ఆటోనగర్ ఆస్తులను లూటీ చేస్తున్నాడని నూతన ఆటోనగర్ నాయకులు ఆరోపిస్తున్నారు.

నంద్యాల పట్టణంలోని స్థానిక ఆటోనగర్ 1995 ఏర్పడిందని అప్పటి నుండి అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదని, ఆటోనగర్లో 100 కోట్లకు పైగా పాప జాకీర్ స్వాహా చేసినట్లు నూతన ఆటోనగర్ అధ్యక్షులు పంపు టెస్టర్ భాష, సెక్రెటరీ ఎస్ మగ్బుల్ , ట్రెజరర్ ఎస్ అమీర్ భాష, సెక్షన్ ప్రెసిడెంట్ ఎస్ ఎం డి రఫీ, కమిటీ మెంబర్లు ఎస్ షఫీ, ఎస్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోనగర్ 1995లో టి సి ఐ ట్రాన్స్పోర్ట్ వారితో 45 ఎకరాలు, ఎకరా 1 లక్ష 60 వేల తో 45 ఎకరాలు మొత్తం 72,00,000 లక్షలతో ఆటోనగర్ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆటోనగర్ కు 1995లో మొదటి అధ్యక్షులుగా డైమండ్ అజీస్ ఐదు సంవత్సరాలు, 1999 నుండి 2004 వరకు జి మహబూబ్ పీరా, 2004 నుండి 2013 వరకు కోహినూర్ మహబూబ్ బాషా, ఆటోనగర్లో అధ్యక్షులుగా పని చేశారని తెలిపారు. 2013 నుండి ఇప్పటివరకు పాప జాకీర్ అధ్యక్ష పదవి కొనసాగిస్తూ ఆటోనగర్ అభివృద్ధి చేయకుండా ఆటోనగర్

**100 కోట్ల రూపాయలకు పైబడి**

స్వాహా చేసి ఆటోనగర్ అభివృద్ధి విషయంలో చేతులెత్తేశాడని వారు తెలిపారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న పాప

**జాకీర్ ఆటోనగర్లో డి ఫోల్డర్ కాదని,**

2008లో ఇతరులకు వచ్చిన ఐదు సెంట్ల ప్లాటును ఆటోనగర్లో కొనుగోలు చేసి, అప్పుడున్న కమిటీ మెంబర్లను ప్రలోభ పెట్టి తన వైపు తిప్పుకొని 2013లో ఆటోనగర్ కార్మికులు తనను ఎన్నుకున్నట్లు అధ్యక్ష పదవి కొన సాగుతున్నాడని తెలిపారు. పాప

**జాకీ ఆటోనగర్ లో అసలు సభ్యుడే కాదని**

అన్నారు. ఆటోనగర్లో మొత్తం 516 మంది గాను 416 మంది డి ఫోల్డర్స్ ఉన్నారని అన్నారు. 2002లో ఎంపీ భూమా నాగిరెడ్డి ఎంపీ ఫండ్ కింద మెటల్ రోడ్లు వేశారని,







అప్పుడే డిప్పుల ప్రకారం కార్మికులకు ఫ్లాట్లు ఇచ్చారని వారు గుర్తు చేశారు.

ఆటోనగర్ బైలాలో ఆటోనగర్ డెవలప్ మెంట్ ప్రాపర్టీ 84 సెంట్లు పెట్రోల్ పంపు కోసం, 2 ఎకరాల 20 సెంట్లు కమిటీ హాల్, ఆఫీస్ రూమ్, కమిటీ డెవలప్మెంట్ కోసం, గ్రీన్ ల్యాండ్ 50 సెంట్లు, మరియు 30 సెంట్లు తీయడం జరిగిందని, డెవలప్మెంట్ కోసం తీసిన స్థలాలు ఎవరికి తెలియకుండా గుట్టుచప్పుడుగా ఆటోనగర్ అధ్యక్షులు పాప జాకీర్ అమ్ముకోవడం జరిగిందని ఆరోపించారు. ఆటోనగర్లో ఆఫీస్ కమిటీ కోసం ఉంచిన 20 సెంట్లు స్థలాన్ని ఎక్స్ కౌన్సిలర్ జాకీర్ కబ్జా చేశాడని అన్నారు. ఆటోనగర్లో స్థలాలు రిజిస్టర్ చేస్తానని, రిజిస్టర్ కోసం 35 వేల రూపాయలు ఖర్చు వస్తే, కార్మికులతో ఒక్కొక్కరితో 45 వేల రూపాయలు డబ్బులు కట్టించుకుని రిజిస్టర్ చేసి ఇచ్చిన వారికి ఇప్పటికీ స్థలము చూపించలేదని అన్నారు.

వారు 15 మంది ఉన్నారని, రిజిస్టర్ కోసం డబ్బులు కట్టించుకున్న వారికి రిజిస్టర్ చేసి ఇయ్యలేదని, వారు 40 మంది వరకు ఉన్నారని, రిజిస్టర్ టైంలో నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వంద రూపాయల స్టాంపులు దొరకలేదని, సిరివెళ్ల నుండి తెప్పించామని వంద రూపాయల స్టాంపుకు 2,000 రూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. ఆటోనగర్ డెవలప్మెంట్ కోసం ఉంచిన స్థలాలు ఎవరికి తెలియకుండా అమ్ముకున్నాడని, పాప జాకీర్ ఆటోనగర్లో అవినీతికి పాల్పడి

**100 కోట్లకు పైగా స్వహా చేశాడని,**

ఆటోనగర్లో లెక్కలు చూపించి అధ్యక్ష పదవి నుండి తప్పుకోవాలని కార్మికులు డిమాండ్ చేసినప్పటికీ, రాజకీయ పార్టీ నాయకుల అండదండలతో ప్రతి ఒక్కరికి బెదిరించుకుంటూ, లెక్కలు పంచుకుంటూ, ఆటోనగర్లో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. అభివృద్ధి పేరుతో తప్పుడు లెక్కలు చూపిస్తూ కోట్ల రూపాయలు స్వాహా చేశాడని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే క్రింది స్థాయి ఉద్యోగస్తులకు, బయటి వ్యక్తులకు ఆటోనగర్లో స్థలాలు ఇప్పిస్తానని చెప్పి ప్రలోభ పెట్టి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు.

*ఆటోనగర్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలను ఎవరైనా కార్మికులు ప్రశ్నిస్తే, వారిపై రౌడీయిజం, గూండాయిజం చేసేందుకు కూడా జాకీర్ వెనుకాడడని పేర్కొన్నారు. పాప జాకీర్ ఏ ఎండకు ఆ గొడుగు పట్టుకుంటూ తన అధ్యక్ష పదవిని కాపాడుకుంటూ పబ్బం గడుపుకుంటున్నాడని పేర్కొన్నారు. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా ఆటోనగర్లో స్థలాలు రిజిస్టర్ చేసి, దర్జాగా బతికేస్తున్నాడని తెలిపారు. ఆటోనగర్లో పాప జాకీర్ చేసిన అవినీతి అక్రమాలపై, మాజీ ఎమ్మెల్యే భూమ బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా పాప జాకీర్ అవినీతి అక్రమాలు తీసుకువెళ్లామని, పాప జాకీర్ అవినీతి బట్టబయలు చేయాలని నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద రాస్తారోకో కూడా చేశారని, మరియు పోలీస్ స్టేషన్లో పాప జాకీర్ పై ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.*

ఆటోనగర్లో పాప జాకీర్ చేసిన అవినీతి అక్రమాలపై అధికారులు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరిన అధికారులను పాప జాకీర్ ప్రలోభ పెట్టి ఆటోనగర్ లో ఎటువంటి అవినీతి అక్రమాలు జరగలేదని పాప జాకీ అధికారులతో నివేదిక ఇప్పించడం జరిగిందని, ఇలాంటి సందర్భాలలో పాప జాకీర్ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి డబ్బులు వెదజల్లుతూ బయట పడుతున్నాడని అన్నారు. ఆటోనగర్లో ఎక్కడ కూడా రోడ్లు వేసిన పాపాన లేదని, వర్షం వస్తే ఆటోనగర్ పరిస్థితి పూర్తి అధ్వానంగా ఉంటుందని, ఆటోనగర్ కార్మికులు ఆటోనగర్లో పని చేసుకోవడానికి రావాలన్న వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురివుతున్నారని పేర్కొన్నారు. ఆటోనగర్ అభివృద్ధి చేయకుండా, అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటూ ఉన్నాడని తెలిపారు. ఆటోనగర్ ప్రస్తుత అధ్యక్షులు పాప జాకీర్ పాపం పండిందని, ఆటోనగర్ యొక్క లెక్కలు చూపించి తన అధ్యక్ష పదవికి రాజీనామా చేసే వరకు వివిధ రకాల పోరాటాలు చేసి ప్రభుత్వం దృష్టికి వెళ్లెంతవరకు పోరాటాలు చేస్తామని, ఇంతటితో ఆగేదే లేదని, కార్మికుల క్షేమం, ఆటో నగర్ అభివృద్ధి కోసం విశ్రమించేది లేదని నూతన కమిటీ అధ్యక్షులు పంపు టెస్టర్ భాష, సెకరెటరీ మగ్బుల్ , ట్రెజరర్ ఎస్ అమీర్ భాష, సెక్షన్ ప్రెసిడెంట్ ఎస్ ఎం డి రఫీ, కమిటీ మెంబర్లు ఎస్ షఫీ, ఎస్ హుస్సేన్, తెలిపారు.

# నీట్(పీ జి - నీట్)2026 పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లాలో



నీట్ పీజీ 2026 కు సంబంధించి 04 పరీక్ష కేంద్రాలలో 770 అభ్యర్థులు హాజరయ్యే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా 30.08.2026 తేదీన ఉదయం 9:00 గంటలకు పరీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ పరీక్షా కేంద్రాలను స్వయంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... నంద్యాల జిల్లాలో ఏ వి ఆర్, ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, రామకృష్ణ పిజి కాలేజ్, ఆర్ జి ఎం ఇంజనీరింగ్ కాలేజ్ , శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజ్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష నిర్వహించడానికి ముందు రోజు నుండే 24/7 బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగింది.

కేంద్ర అధికారులు మరియు టిసిఎస్ ప్రతినిధులతో సమన్వయం చేసుకునే పరీక్షా కేంద్రాలలోకి 8:30 గంటల లోపే అనుమతించేలా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించి ముందుగా ఫ్రిస్కింగ్ మరియు స్క్రీనింగ్ చేసి పరీక్షా కేంద్రంలో పలికి అనుమతించడం జరిగింది.

పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్లు మరియు స్మార్ట్ వాచీలు, బ్లూటూత్, ఇయర్ పీస్ లు, ఏఐ గ్లాస్సెస్, చిన్న కెమెరాలు మరియు ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలతో సహా అన్ని నిషేధిత పరికరాలను అనుమతించకుండా స్క్రీనింగ్ చేయడంతో పాటు పరీక్షా ప్రశాంతంగా, సజావుగా మరియు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకోవడం జరిగింది.

పరీక్ష కేంద్రాలలో మొబైల్ సిగ్నల్ పనిచేయకుండా జామర్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక ఉన్నతాధికారితో పాటు సరిపడా సిబ్బందిని నియమించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను నియమించి, ఎక్కడా అభ్యర్థులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుని అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చర్యలు తీసుకోవడం జరిగింది.

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో డ్రోన్ పెట్రోలింగ్ తో పాటు సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్ బృందాల ద్వారా నిరంతర నిఘా మరియు పర్యవేక్షణ నిర్వహించారు.

విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ అధికారులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# పాతాళ గంగను నమ్ముకుని వరి సాగు

**-రైతులనుగట్టెక్కించమ్మాగంగమ్మ తల్లి -ఉధృతంగా పొంగిపొర్లుతున్న బోరు నీరు**

దొర్నిపాడు ఆగస్టు 30 పల్లె వెలుగు న్యూస్ దేశానికి రైతే రాజు అంటారు అలాంటి రైతు





బాగుంటేనే రాజ్యం ,రాష్ట్రం ,బాగుంటుంది కానీ ఇప్పుడు రైతుల పరిస్థితి దయనీయంగామారింది అని చెప్పవచ్చు, మహమ్మారి రూపంలో రైతులను వెంటాడుతున్న లెనోవా ప్రభావం వల్ల వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోయి అరకొరకగా పంటలు చేతికి రావడంతో రైతులు అప్పుల ఊబిలోనికి నెట్టబడుతున్నారు, వర్షాలు రాక డ్యాముల్లో, కేసీ లో నీళ్ల లేక పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది,రైతులుఅధైర్యపడకుండపాతాళ గంగను నమ్ముకుని బోర్ల కింద వరి సాగు చేస్తున్నారు బోర్ల నుండి ఉధృతంగా ప్రవహిస్తున్న నీళ్లను చూసి గంగమ్మ తల్లి మమ్మల్ని ఘట్టెక్కించమ్మా అంటూ బోర్లను నమ్ముకునివరిసాగుకుసిద్ధమయ్యారు రైతన్నలువర్షాలు రావు అని నిర్ధారించుకుని బోర్ల కింద సాగు చేస్తున్నారు, వరుణ దేవుడు కరుణించకపోయిన పాతాళగంగ నీళ్లతో పంటలు పండుతాయనేగంపెడాశ లతో రైతులు ఉన్నారు

# నీట్ - పీజీ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

కర్నూల్ సిటీ నీట్ - పీజీ పరీక్ష సందర్భంగా కర్నూలు లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను ఎస్పీ స్వయంగా పరిశీలించి పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కర్నూలు ?డా.కె వి సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , కర్నూలు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్షా కేంద్రాలను కర్నూలు ఎస్పీ పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కర్నూలు ఎస్పీ తో కర్నూలు డిఎస్పీ రాఘవేంద్ర, సిఐలు ,




Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com